సారా రవాణా చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి -హుకుంపేట:సారా రవాణా చట్టరీత్యా నేరమని స్థానిక ఎస్సై బి.సతీష్ తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో గతంలో నాటు సారా కేసులో పట్టుబడిన 16మంది నిందితుతలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి 337 లీటర్లు నాటు సారా సీజ్ చేశామని ఎస్సై చెప్పారు. పట్టుబడిని ఈ సారాను పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ధ్వంసం చేశారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ, నాటు సారా క్రయ విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమని, వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే ఎనిమిది సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని ఆయన అన్నారు. యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ

రైతుల ఆదాయం పెంపునకు కృషి

రూ.126 కోట్ల రైతు భరోసా నగదు జమ
జిల్లాలో 1.69 లక్షల మంది రైతులకు లబ్ధి
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా సొమ్మును జమ చేసిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ఏఎస్ఆర్ జిల్లాలో 1లక్ష 69 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజక వర్గం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి ఐదవ సంవత్సరం మొదటి విడత రైతు భరోసా-పి ఎం కిసాన్ విడుదల ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని గురువారం స్థానిక కాఫీ హౌస్ నుండి పాడేరు, అరుకు శాసన సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ కు 4 వేల 500 వందల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు వెల్లడించారు. 15 వేల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. మరో 11 వేల ఎకరాల్లో గ్యాస్ ఫిల్డింగ్ వేస్తున్నామని స్పష్టం చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 10 వేల ఎకరాల్లో ఉద్యాన వన తోటలు పెంపకానికి చర్యలు చేపట్టామన్నారు. రైతు ఆదాయం పెంచడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. మూడు లక్షల ఎకరాలకు ఇ-క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందని చెప్పారు. ఆర్ ఓ ఎఫ్ రైతులందరికి రైతు భరోసా అందించడానికి కషి చేస్తున్నామన్నారు.

పాడేరు శాసన సభ్యురాలు కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పోడు భూములకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13,500లు రైతు భరోసా అందిస్తోందన్నారు. కౌలు రైతులకు, జిరాయితీ భూములకు రైతు భరోసా జమ చేస్తున్నారని చెప్పారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగాగ్రామాల్లో పర్యటించినప్పుడు పి.ఎం. కిసాన్ రాలేదని ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. రైతులు ఇకెవైసి చేసుకోవాలని సూచించారు. రైతులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి రైతు భరోసా అందించాలన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో వెదురు, రబ్బరు సాగును ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి ప్రోత్సహించాలని చెప్పారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ

గిరిజన రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయాలని సూచించారు.

అరకు శాసన సభ్యులు పాల్గుణ మాట్లాడుతూ, రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులను రాజులను చేస్తోందన్నారు. స్థానికంగా నర్సరీలు పెంచితే ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉంటాయని, ఇతర ప్రాంతాల నుండి తెచ్చిన మొక్కలు బతకలేదని పేర్కొన్నారు. గిరిజన రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని చెప్పారు. రాయితీ పై దుక్కిటెద్దులను అందించాలని అన్నారు. పట్టుగూళ్ల పెంపకం, అల్లం, పసుపు వంటి వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం రైతులకు నమూనా చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపిపి సోనారి రత్నకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్. నంద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి, పలువురు జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి నిర్వహణ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నబాబు

ప్రజాశక్తి -విఆర్ పురం :పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, వారికి పునరావాసం కల్పించాలన్న డిమాండ్‌తో ఈ నెల 20 నుంచి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాపాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సోపల్లి గ్రామంలో పోలవరం నిర్వాసితుల పాదయాత్ర జయప్రదానికి సన్నాహకంగా నిర్వహించిన సమావేశంలో చిన్నబాబు మాట్లాడుతూ గత వరదలకు నష్టపోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని ఈనెల 20 నుంచి ప్రారంభించనున్న పాదయాత్ర, ముంపు గ్రామాల మీదుగా 20 రోజులపాటు కొనసాగి విజయవాడకు చేరుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వాసితులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాదైనా గోదావరి నదికి వరదలు రాకముందే పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే నిర్వాసితుల ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు..

గతేడాది జులైలో గోదావరికి వచ్చిన వరదలతో తీవ్రంగా నష్టపోయి, నేటికీ కోలుకోని స్థితిలో ఉన్న నిర్వాసితులను, ముంపుబాధిత గిరిజన ప్రాంతాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కుంజ నాగిరెడ్డి, వడ్డాది. రమేష్ సుధీర్, కారం. బుచ్చమ్మ, శాఖ కార్యదర్శి కారం. వెంకటయ్య, మాజీ శాఖ కార్యదర్శి వర్మ దేశయ్య, కారం వీరయ్య, జానకిరామ్, కారం. సత్యం పాల్గొన్నారు.

అల్లం ధరలకు రెక్కలు

కిలో రూ.220కు అమ్మకాలు

ప్రజాశక్తి-పాడేరు:

ఏజెన్సీలో అల్లం ధరకు రెక్కలు వచ్చాయి. రిటైల్ మార్కెట్లో ప్రస్తుతం కిలో అల్లం రూ.220లకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. అల్లం ధర అమాంతంగా పెరిగే సరికి వినియోగదారులు విస్తు పోతున్నారు. ఏజెన్సీ మార్కెట్లలో విరివిగా చౌకగా దొరికే అల్లం ధర నాలుగింతలు రెట్టింపు అయ్యేసరికి రిటైల్ మార్కెట్ వ్యాపారుల తీరుపై వినియోగదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ అల్లం పంటకు ఎంతో ప్రసిద్ధి. సాధారణంగా ఇక్కడ గిరిజన రైతులు పండించే ఈ అల్లం ఈ ప్రాంతంలో తక్కువ ధరకే లభిస్తుంది. మైదాన ప్రాంతాల మార్కెట్లతో పోలిస్తే అల్లం ధర ఎప్పుడు చాలా చౌకగానే ఉంటుంది. ఈ ఏడాది ఆరంభంలో జనవరి నుంచి ఓ రెండు నెలల పాటు రిటైల్ మార్కెట్లో కిలో అల్లం 30 రూపాయల నుంచి 50 రూపాయల వరకు లభ్యమయింది. ఉన్నట్టుండి ఈ నెలలో అల్లం ధర భారీగా పెరిగింది. సాధారణంగా మన్య ప్రాంతంలో వ్యాపారులు భారీగా అల్లం కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ లాభసాటి గా వ్యాపారం చేస్తుంటారు. అల్లం ఈ ప్రాంతంలో చౌకగా లభించడమే ఇందుకు కారణం. ఏజెన్సీ వారపు సంతల్లో వ్యాపారులు తప్పనిసరిగా అల్లం కొనుగోళ్లు పెద్ద ఎత్తున చేస్తుంటారు. ఏజెన్సీలో గిరిజన రైతులకు కోల్డ్ స్టోరేజీలు వంటివి అందుబాటులో లేకపోవడంతో అల్లం పండించే రైతులు మాత్రం పెద్దగా లాభాలు ఆర్జించిన పరిస్థితులు మాత్రం ఎప్పుడూ కానరావు. ఏజెన్సీ సంతలు మార్కెట్లో అమ్మకాలు కొనుగోళ్లపై ఎటువంటి అధికారుల నిఘా లేకపోవడంతో ధరలకు కళ్లెం వేసే పరిస్థితి కానరాలేదు. ఎన్నడూ లేని విధంగా అల్లం ధర కిలో 2.20 రూపాయలు ధర ఉండడం మాత్రం వినియోగదారులను అమ్మో అనిపిస్తుంది.

ఏడుగు రాళ్లపల్లిలో అగ్ని ప్రమాదం

తాటాకిల్లు దగ్ధం : రూ.లక్ష ఆస్తి నష్టం

దగ్ధమైన తాటాకిల్లు

ప్రజాశక్తి- చింతూరు.: ఏడుగు రాళ్లపల్లిలో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. చర్చికి సంబంధించిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న వారు మూడు రోజుల క్రితం వేరే ఊరు వెళ్లగా, ఎవరూ లేని సమయంలో ప్రమాదం సంభవించడంతో ఇంట్లోని బట్టలు, బీరువా, మంచం, ఇతర సామగ్రి సర్వం బూడిదైంది. ఇంటి వెనుక నున్న తాటి చెట్టు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి, అవి తాటాకింటికి వ్యాపించడంతో సర్వం ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

మరమ్మతుకు నోచని అంగన్‌వాడీ కేంద్రం

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి -హుకుంపేట:నూతన అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని ఎగగరుడాపల్లి గ్రామస్తులు కోరారు. మండలంలోని తీగలవలస పంచాయతీ ఎగ గరుడాపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ శిథిలా వ్యవస్థకు చేరింది. ఈ భవనాన్ని 1990 సంవత్సరంలో నిర్మాణం చేపట్టారు. భవనం రేకులు పాడైపోయి ప్రమాదపు అంచులో ఉన్నాయి. 30 మంది పిల్లలు అంగన్వాడి సెంటర్లో ఆటపాటలు నేర్చుకుంటున్నారు. ఈ గ్రామంలో ఇదే మెయిన్ సెంటర్ కావడంతో. పిల్లలు ఆటలు పాటలు, భోజనాలు చేసేందుకు ఈ భవనం సరిపడటం లేదని గ్రామస్తులు అంటున్నారు. శిథిలావ్యవస్థకు చేరిన భవనంలో ఎప్పటికైనా ప్రమాదం పొంచి ఉంటుందని పలువురు అంటున్నారు. అధికారులు స్పందించి నాడు నేడులో భాగంగా నూతనంగా అంగన్వాడీ సెంటర్ నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట:ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సీదరి సాంబ కోరారు. మండలంలోని మట్టుజోరు పంచాయతీ నక్కల తాడేపుట్టు రంగపల్లి, దబ్బబంధ, పెట్టుగోడలీ, కుంతుర్ల, నక్కలపుట్టు తదితర గ్రామాలకు చెందిన సుమారు 56 మంది రైతులకు విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ సాంబ మాట్లాడుతూ, జూన్ నెలల నుంచి వ్యవసాయ సీజన్ కావడంతో ప్రభుత్వం గుర్తించి ముందుగానే పంపిణీ చేస్తుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ దీప, మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి: పిఒ

ప్రజాశక్తి -పాడేరు:ఎస్ఎన్‌సియు ఏర్పాట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఆదేశించారు. గురువారం స్థానిక పాత ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో ఎస్ఎన్‌సి యు వార్డు ఏర్పాటు చేయు పనులను పరిశీలించి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, కాంట్రాక్టరుతో మాట్లాడుతూ, త్వరగా పని పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట ఏసిలు, పేషెంట్లు వెయిటింగ్ చేసే ప్రదేశంలో ఫాన్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. చిన్న పిల్లల వార్డును పరిశీలించి తల్లులతో ముచ్చటించారు.

ప్రమాదభరిత రోడ్డును పట్టించుకోరా?

నిండా గోతులమయమై రాకపోకలకు ఇక్కట్లు
ఇరువైపుల నుంచి పొదలు కమ్మేయడంతో అవస్థలు
నేతలు, అధికారుల నిర్లక్ష్యంపై మన్యవాసుల మండిపాటు

ప్రజాశక్తి-విఆర్ పురం: పర్యాటకంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న రేఖపల్లి, మొత్తులగూడెం జంక్షన్ నుంచి పోచవరం వెళ్లే మార్గంలో రహదారి నిర్వహణలో నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుపొడుగునా నిండాగోతులమయం కావడంతోపాటు ఇరువైపులా పొదలు కమ్మేయడంతో ప్రమాదభరితంగా మారిందని పలుమార్లు మొరపెట్టుకున్నా అధికారులుగానీ, నేతలుగానీ పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే 10,15 గ్రామాల గిరిజన కొండరెడ్లు మొత్తులగూడెం జంక్షన్ నుంచి పోచవరం వెళ్లే రోడ్డే ఆధారం. పర్యాటకంగా ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత ఉటూరిజం వైల్డ్‌లైఫ్ శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు పెట్టి, అటుగా వచ్చిపోయే కార్లు, బస్సులు,ఇతర వాహనాల నుంచి భారీగానే రుసుం వసూలు చేస్తున్నారు. ఆదాయం బాగానే ఉన్నా, ఈ రోడ్డు నిర్వహణ, అభివృద్ధి చేయడంలో సంబంధిత అధికారులు ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చూపుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. బిటి రోడ్డు ఎక్కడికక్కడే లేచిపోయి గుంతలమయమైంది. ఇక ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేయడంతో ఇరుకుగా మారే పరిస్థితి ఉంది. మలుపులు వద్ద రోడ్డును ఇరువైపుల నుంచి కమ్మేసిన పొదలు వల్ల వచ్చిపోయే వాహనాలను గుర్తించలేని స్థితిలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు

పోచవరం వెళ్లే రహదారిలో ప్రమాదకర మలుపు

ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు స్పందించి, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేయడంతోపాటు, రోడ్డుకు ఇరువైపులా అంచుల్లో బెర్మ్‌లు వేసి, పటిష్టం చేయడం ద్వారా రోడ్డు వెడల్పు చేయాలని, ప్రమాదకర మలుపులు వద్ద రోడ్డును కమ్మేసిన పొదలను తొలగించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఈ మార్గంలో అత్యధికంగా ప్రయాణించే కొండరెడ్లుతోపాటు పలువురు వాహనదారులు, స్థానిక గిరిజనులు కోరుతున్నారు. రోడ్డు దుస్థితిపై పలుమార్లు అధికారులకు విన్నవించడంతోపాటు పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారులు, నేతల్లో ఇసుమంతైనా కదలిక, స్పందన లేకపోవడం గిరిజనుల పట్ల వారికున్న చిన్నచూపు, నిర్లక్ష్యవైఖరికి అద్దంపడుతోందని పలువురు అంటున్నారు.

398 లీటర్ల నాటుసారా ధ్వంసం

ఎఎస్‌పి పర్యవేక్షణలో నాటుసారా ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 35 కేసుల్లో పట్టుబడిన 398 లీటర్ల నాటుసారాతోబాటు, గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 13 మద్యం బాటిళ్లను గురువారం ధ్వంసం చేశారు. రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అదహళ్లి పర్యవేక్షణలో రాజవొమ్మంగి సీఐ షేక్‌బాజీలాల్ ఆధ్వర్యంలో జడ్డంగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వీటిని పెద్దగొయ్యి తీసి, అందులో పారబోసి కప్పేశారు.

ఈ సందర్భంగా సిఐ షేక్‌బాజీలాల్ మాట్లాడుతూ, నాటుసారా తయారీ, విక్రయించడం చట్టరీత్యానేరమని, ఇటువంటి అక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాటుసారా వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా ఛిద్రం కావడంతోపాటు ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. నాటుసారా అమ్మకం ద్వారా తోటిగిరిజనుల కుటుంబాల్లో చిచ్చుపెట్టడం తగదన్నారు. నాటుసారాకు ప్రత్యామ్నాయంగా ఏదైనా వ్యాపారం చేసుకోవాలని, దానికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం కూడా ఉంటుందన్నారు. ప్రజలు సైతం తమ గ్రామాల్లో, వీధుల్లో, జనావాసాల మధ్య నాటుసారా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారమివ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు గోపి నరేంద్రప్రసాద్, షరీఫ్ చెరుకుంపాలెం, రాజవొమ్మంగి విఆర్ఒలు నాగేశ్వరరావు, భారతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి- చింతూరు : అరకొర వేతనాలతో ఆశావర్కర్లు నానా అవస్థలు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలను కల్పించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధానకార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం చింతూరు మండల కేంద్రంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆశ వర్కర్ల మండల కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు ఆశావర్కర్లకు మూడేళ్లుగా యూనిఫారాలు ఇవ్వడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో గిరిజనులకు అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు సహకరించడంతోపాటు, ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరిని భాగస్వాములను చేస్తున్న అధికారులు, ప్రభుత్వం ఆశాల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆశాల సమస్యలన్నీ పరిష్కరించాలని లేకుంటే, వారందరినీ సమీకరించి, ఐటిడిఎను ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ఏజెన్సీలోని సబ్‌సెంటర్లలో సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, ఆశ వర్కర్ల యూనియన్ మండల కమిటీ సభ్యులు రవ్వ వీరమ్మ, బీరబోయిన దారేశ్వరి, దుబి కాంతమ్మ, బంధం దుర్గ, పైడితల్లి, జమున పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండల పరిధిలోని లబ్బర్తి, కింద్ర, లాగరాయి పంచాయతీల పరిధిలోని కు 14 గ్రామాలలో ఈనెల 2న శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ డిఇఇ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రాజవొమ్మంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జడ్డంగి ఫీడర్ 11కెవి విద్యుత్ లైను కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా పుష్ప సౌజన్య

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా పుష్పసౌజన్య గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిఎఫ్‌గా పనిచేస్తున్న సాయిబాబు మంగళగిరికి బదిలీకాగా, ఆ స్థానంలో పుష్పసౌజన్యను ప్రభుత్వం నియమించగా ఈ మేరకు విధుల్లో చేరారు.

పుష్పసౌజన్య

నేడు వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి -మారేడుమిల్లి: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న మండలంలోని గ్రామ వాలంటీర్లు అందరికీ ఈ నెల 2న శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించనున్నట్లు ఎంపిడిఒ ప్రకటనలో తెలిపారు. వాలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ సత్కారం చేస్తామన్నారు. అనంతరం మారేడుమిల్లి పంచాయతీలోని మూసురు, మద్దులూరు, పూజారిపాకలు, కూడూరు గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పాలాభిషేకం చేస్తున్న మహిళా కార్యకర్తలు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ :టిడిపి మ్యానిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కిముడు మహేశ్వరి అధ్వర్యంలో చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురువారం మహేశ్వరి మాట్లాడుతూ, మహానాడులో మహిళా సాధికారతే లక్ష్యంగా టిడిపి మానిఫెస్టో ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేశారు. మానిఫెస్టోలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఆర్టీసి బస్సు లో మహిళలకు ఉచిత ప్రయాణం, అమ్మకు వందనం, నెలకు రూ.1500, మూడు గ్యాస్ సిలిండర్లు ప్రకటించినందుకుగాను గిరిజన మహిళల తరఫున చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా సంఘం నాయకురాలు కొర్ర మిఠాయి, మండల ప్రధాన కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు, స్థానిక వార్డు మెంబర్ తిరుపతిరావు, భూషణ్ రావు, రవికుమార్ పాల్గొన్నారు.

ఖోఖో ఆడుతున్న చిన్నారులు

గ్రంథాలయంలో ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సునీత, సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖ గ్రంథాల యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి ప్రభాకరరావు అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రుల ప్రాముఖ్యత ను వివరించారు. సిహెచ్ భవాని స్పోకెన్ ఇంగ్లీష్ లో కిడ్స్ ఆఫ్ యాక్టివిటీస్ వివరించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ స్కూల్ పివి కనకరాజు మాస్టర్ విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ లక్ష్మీ రాజేశ్వరి కాగితాలతో పూల సజ్జలను తయారీపై చేసి చూపించారు. గ్రంథాలయాధికారి పి.దమయంతి పాల్గొన్నారు.

గొలుగొండ: విద్యార్థులందరికీ విద్యతో పాటుగా వ్యాయామం అవసరమని గ్రంథాలయ అధికారి రాజుబాబు అన్నారు. వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఖోఖోపై శిక్షణ ఇచ్చారు.

కోటవురట్ల:స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనం పై అవగాహన కల్పించారు.రిసోర్స్ పర్సన్ రాంబాబు మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం పుస్తకాలను చదువుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న నాటికలు

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలో బుధవారం ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. తెలుగు మాడుగులకు చెందిన గన్నవరపు సుబ్బారావు మాస్టారు కళా నిలయం పేరిట వారి కుమారుడు గిరిబాబు సమర్పణలో విశాఖ వాసి నటించిన సవారి నాటిక ఆలోచింపజేసింది. డబ్బే ప్రధానం, డబ్బు కోసం తల్లిదండ్రులైనా చంపడానికి సిద్ధపడే కొడుకులు, కుమార్తెలు, డబ్బు ప్రధానంగా భావించి బంధాలు, అనుబంధాలు దూరం చేసుకునే వ్యక్తులు సమాజంలో వున్నారనే ఇతి వృత్తంతో ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. రచన స్క్రిప్ట్, తండ్రి పాత్ర, దర్శకత్వం బాలాజీ నాయక్ వహించగా, గిరి బాబు, అనిల్ కుమార్, వాసు, నాయుడు, హేమ, కుమారి నటించారు. సంగీతం లీలా మోహన్, మేకప్, లైటింగ్ థామస్ అందించారు. అనంతరం కలిసుందే నాటిక అబ్బుర పరిచింది. 60 ఏళ్ల వయస్సులో అందమైన అమ్మాయిగా మారాలని కోరుకునే భామ్మ, ఇంటి పనులు పక్కన పెట్టి టివి సీరియల్స్‌కు అతుక్కుపోయిన భార్య, టిక్ టాక్, సెల్ఫీలతో కాలక్షేపం చేసే భార్యతో విసుగెత్తి భర్త అడవుల్లోకి పారిపోవడం, అక్కడ ఇలాంటి బాధితులతో కలవడం, తరువాత ఇంట్లో నుండి వచ్చి తప్పు చేశామని తెలుసుకుంటారు. కుటుంబ సభ్యుల మధ్య చిన్న చిన్న భేదాభిప్రాయాలు సర్దుకు పోవాలి తప్ప ఇగోతో జీవించరాదని తెలియచేసే నాటిక ఆకట్టుకుంది. నంది అవార్డ్ గ్రహీత, జర్నలిస్ట్ ఎస్.డేవిడ్ రాజు రచన, దర్శకత్వం వహించి ప్రధాన పాత్రలో నటించగా బాబీ విజయ సాయి, మొహిద్దీన్, శివ జ్యోతి, మల్లిక, కుమారి నటించారు. సంగీతం లీలా మోహన్, రంగాలంకరణ చందు, ఆహార్యం కుమారి, విజయ సాయి సహకారం మొ గలి గునకర్ అందించారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్ అప్పలరాజు, ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఏటికొప్పాకలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, 2020-2021 క్రషింగ్ సీజన్ నుండి కార్మికులకు వేతన బకాయిలు 8 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. 2 క్రషింగ్ సీజనులు ముగుస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు పస్తులతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు పిఎఫ్ బకాయిలు, గ్రాట్యుటీ ఇతర బెనిఫిట్స్ చెల్లించలేదని, దీంతో 40 సంవత్సరాలకు పైగా కార్మికులు చేసిన కష్టానికి ఏ విధమైన ప్రతిఫలం అందలేదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వెంటనే కార్మికులకు వేతన బకాయిలను, ఇతర అన్ని బెనిఫిట్స్ వెంటనే అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీని తెరిపించి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. త్వరలో రాష్ట్ర ప్రాథమిక మంత్రి గుడివాడ అమర్నాథ్, ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు తెలియ జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కర్రి సత్యనారాయణ, గుండుబోగుల గోవిందరావు, దాయవరపు హనుమంతరావు, కోరిబిల్లి రమణ, పీలా గోవింద్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు మండలంలో చందనాడ గ్రామంలో.గురువారం ఉపాధి కూలీలతో ఎం.అప్పలరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్‌లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరంలో జాబ్ కార్డు లు ఇద్దరు ఉన్న కుటుంబానికి ప్రస్తుతం 100 రోజులు పని కల్పిస్తుండే భార్య భర్తకు చెరో 50 రోజులు మాత్రమే పని ఉంటుందన్నారు. 100 రోజు లు వ్యవసాయేతర పనులు, ఉపాధి పనులు 50 రోజు లు కలిపి 150 రోజులు పని ఉండగా సంవత్సరంలో మిగతా రోజులు కూలీలకు పనులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజు వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో అక్షాహెబ్ పేటలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు గడపగడపకు మన కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. పలువురు గ్రామంలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. పలువురు గ్రామస్తులు కాలనీ ఇల్లు మంజూరుకు వేడుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారం చేపడుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసిల్దార్ జానకమ్మ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పిఆర్ ఇంజనీర్ వర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, బికెపల్లి ఎంపీటీసీ రాంబాబు, చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివరాం, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యన్న హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నంలో విద్య, వైద్య రంగం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు హయాంలో అభివృద్ధి చేశారని మున్సిపల్ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు తెలిపారు. విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అభివృద్ధి అయ్యన్నపాత్రుడు పై వైసిపి నాయకులు, ఎమ్మెల్యే గణేష్ బైక్ ర్యాలీలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విమర్శించడం తగదని ఆగ్రహించారు. 150 పడకల ఏరియా ఆసుపత్రిని అయ్యన్న అభివద్ధి చేయగా ప్రస్తుతం కొన్ని రోజులుగా జనరేటర్, లిఫ్ట్ పని చేయలేదన్నారు. పారిశుద్ధ్య వాహనాలకు సైతం డీజిల్ వేయలేని ఎమ్మెల్యే గణేష్ అని విమర్శించారు. విజయ్ కు ఎటువంటి పదవులు లేకపోయినా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగేశ్వరరావు, కొరుపోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లాడ్జీలో పట్టుబడ్డ తుపాకీ

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూ కాలనీలోని ఓ లాడ్జి గదిలో ఉన్న వ్యక్తుల వద్ద తుపాకీ పట్టుబడింది. తుపాకీ కలిగి ఉన్న వ్యక్తులపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి డిసిపి గంధం నాగన్న మీడియాకు వెల్లడించారు. లాడ్జిల్లో జరిపే సాధారణ తనిఖీల్లో భాగంగా రైల్వే న్యూకాలనీలోని లక్ష్మీరాయల్ హోటల్‌కు వెళ్లినప్పుడు తుపాకి కలిగివున్న వ్యక్తులను గుర్తించామన్నారు. హోటల్ రూమ్ నెంబర్-5లో ఆరుగురు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు. వారి వద్ద నాటు తుపాకీ ఉంది. ఈ తుపాకీ లైసెన్స్ ఫిస్టల్‌కు దగ్గర పోలిక ఉంది. గదిలో ఉన్న ఆరుగురిలో ఇద్దరికి మాత్రమే తుపాకి తరలింపు సమాచారం ఉంది. మిగిలిన వారికి ఈ విషయం తెలియదు. గుర్తు తెలియని వ్యక్తి అప్పగించిన పని ప్రకారం ఈ తుపాకీని పూరీ నగరానికి వీరు తీసుకెళ్తున్నారు. తుపాకీ అప్పగించేందుకు రూ.30 వేలు డీల్ కుదిరింది. సదరు వ్యక్తి దారి ఖర్చులకు రూ.10 వేలు ఇచ్చాడు. నాందేడ్ నుంచి పూరీ వెళుతూ విశాఖలో ఆగారు. సుపారీ వ్యవహారంలో వీరు తుపాకీ తీసుకొచ్చారన్నది అవాస్తవమని డిసిపి చెప్పారు. శ్రీధర్ హరికిషన్ సింగ్ పతంగిని అరెస్టు చేశామని, వీరిపై నేర చరిత్ర ఉందా, లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరు తీర్థయాత్రకు వెళుతున్నట్లుగా చెపుతున్నారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - కశింకోట : తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోవడంతో గీత కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం కశింకోట మండలం పల్లపు సోమవారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి. పి.సోమవారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు దుంగా తాతారావు (64) గురువారం తాటి కల్లుగీసేందుకు చెట్టు ఎక్కగా, నడుముకు కట్టిన తాడు ఊడిపోవడంతో చెట్టుపైనుంచి పడిపోయాడు. ఈ ప్రమాదంలో సంఘటనాస్థలిలోనే తాతారావు మృత్యువాత పడ్డాడు. మృతుని భార్య నూకరత్నం నుంచి అందిన సమాచారం మేరకు కశింకోట పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టిఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కల్లుగీతే జీవనాధారం ఉన్న ఆ కుటుంబానికి పెద్దదిక్కు తాతారావు మరణంతో తీవ్ర విషాదంలోకి మునిగిపోయింది. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులుకోరుతున్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి గొలుగొండ: మండలంలో ఏ ఎల్ పురం బస్ స్టేషన్ వద్ద 8 కేజీల గంజాయిని పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండు సంచులలో ఎనిమిది కేజీల గంజాయిని తరలించడానికి సిద్ధంగా ఉన్న ముగ్గురు నిందితులను కేడిపేట పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ముగ్గురిలో ఇద్దరు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కాగా ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన నవీన్. నిందితుల వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లుగా ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

మరుగుదొడ్ల కరువు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఏపీ అంటూ ప్రచారాలే కనిపిస్తున్నాయి కానీ ఎక్కడా అమలుకు నోచుకోలేదు. మండలంలో నిత్యం రద్దీగా ఉండే తహసిల్దార్ కార్యాలయం వద్ద మరుగుదొడ్ల సౌకర్యం లేక సిబ్బంది సహ వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపుగా ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వివిధ మండలాల ప్రజలు, వృద్ధులు, వికలాంగులు, మహిళలకు మూత్రవిసర్జనకు సైతం ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయం వద్ద మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

హాల్ట్ సౌకర్యాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అతిథులు

కోరాపుట్ రోడ్‌లో రైళ్ల హాల్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే బోర్డు మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోరాపుట్ రోడ్ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రైలు నెంబరు 18107/08 రూర్కెలా - జగదల్‌పూర్ - రౌకేలా ఎక్స్‌ప్రెస్, 18447/48 భువనేశ్వర్ -జగదల్‌పూర్ - భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, రైలు నెంబర్ 18514/13 విశాఖపట్నం - కిరండూల్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ రోడ్‌లో ఇక నుంచి ఆగనున్నాయి. తొలి స్టాపేజ్ కార్యక్రమంలో అతిథులు రమేష్ చంద్ర మాఝీ, బలభద్ర మాఝీ, పద్మిని డియాన్ రైల్వే డివిజనల్ మేనేజర్ అనుప్ సత్పతి పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఎం అనుప్ సత్పతి విశాఖపట్నం - రాయగడ - దమన్‌జోడి - కోత్వర్ రోడ్ సెక్షన్‌లో విండో ట్రైలింగ్ తనిఖీ నిర్వహించారు. రాయగడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. టికిరి స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ వివిధ సంఘాల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో చర్చించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కోరాపుట్ రోడ్‌లో రైళ్ల ఆగమనాన్ని పునరుద్ధరించడానికి రైల్వే చేస్తున్న కృషిని ప్రజా ప్రతినిధులు అభినందించారు.

'నాడు - నేడు'కు రైతు బజార్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నాడు - నేడు బాటలోనే రైతు బజార్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.నందకిషోర్ తెలిపారు. గురువారం విశాఖ నగరంలో పలు రైతు బజార్లను సందర్శించిన అనంతరం ఎంవిపి రైతు బజారులో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల్లో ఉన్న రైతు బజార్లను మరింతగా ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న మరికొద్ది రోజుల్లో రైతులు ఇప్పుడు చెల్లిస్తున్న అద్దెకు బదులు ప్రతి రెండేళ్లకు ఒకసారి వేలంపాట ద్వారా స్టాల్స్ కేటాయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సిసి కెమెరాలు పునరుద్ధరణ, కోల్డ్ స్టోరేజ్ మరమ్మతులు, ఇతరత్రా సమస్యలేమైనా ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. రైతు బజారులోని ప్రతి స్టాల్ ముందూ ధరల పట్టిక ప్రదర్శించేలా చర్యలు చేపట్టినట్టు ఎస్టేట్ ఆఫీసర్ ప్రసాద్ వివరించారు.

సుప్రీం తీర్పుతో ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సుప్రీంకోర్టు తీర్పుతో అమరావతిలోని పేదల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కావడం గొప్ప విజయమని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గురునాథం అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 977 రోజులుగా అమరావతిలో తాము దీక్షలు సాగిస్తున్నామని చెప్పారు. వికేంద్రీకరణ, 55 వేల ఇళ్ల పట్టాల సాధన తదితర అంశాలపై అంశాలపై దీక్షలు చేశామన్నారు.

కొనసాగుతున్న ఐఐఎఫ్ఎల్ బంగారు రుణమేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బంగారు రుణ మేళా గత నెల 15న ప్రారంభమైందని, జూన్ 30 వరకూ కొనసాగనుందని ఐఐఎఫ్ఎల్ అధికారి సౌరభ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ మధ్య కాలంలో బంగారు రుణాలు తీసుకునేవారు కారు, ఎలక్ట్రిక్ స్కూటర్, 32 అంగుళాల ఎల్ఇడి టీవీ, ఫ్రిజ్, స్మార్ట్ ఫోన్లు వంటి బహుమతులు పొందే అవకాశం ఉందన్నారు. వినియోగదారుల నమ్మకం ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కి ఒక వరం అన్నారు. ఐఐఎఫ్ఎల్ బంగారు రుణ మేళా అందరికీ ఆఫర్లను అందించే ఒక పెద్ద కార్యక్రమమని తెలిపారు. ఈ మేళాలో పాల్గొనడానికి వినియోగదారులు ఏదైనా ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ శాఖను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

సరిపడారాని విద్యాకానుక కిట్లు

సగం కూడా చేరని పాఠ్యపుస్తకాలు
నోట్ పుస్తకాల పరిస్థితీ అంతే
యూనిఫామ్‌కు మీటర్ గుడ్డా రాలేదు
మరో పది రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పాఠశాలలు పున:ప్రారంభం నాటికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందేలా లేవు. ఈ నెల 12న పాఠశాలలు తెరవనున్నప్పటికీ విద్యార్థులకు సరిపడా పంపిణీ చేసేందుకు జిల్లాకు కిట్లు చేరలేదు. జిల్లాలోని 24 మండలాల్లో వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన 1498 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థులు 1,23,971 మంది ఉన్నారు. వీరిలో బాలురు 59,051 మంది, బాలికలు 64,920 మంది వున్నారు. వీరిలో ఒక్కొక్క విద్యార్థికీ బ్యాగు, బెల్టు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, మూడు జతల యూనిఫాం క్లాత్, ఆరు నుంచి పది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, ఒకటి నుంచి ఐదు విద్యార్థులకు పిక్టోరియల్ నిఘంటువు ఇవ్వాల్సివుంది. మరో పది రోజుల్లో తరగతులు ప్రారంభంకానున్నప్పటికీ పాఠ్యపుస్తకాలు సరిపడా జిల్లాకు రాలేదు.

ఒకటి నుంచి పది విద్యార్థులకు 14,52,043 పాఠ్య పుస్తకాలు అవసరంకాగా 5,11,022 వచ్చాయి. అవసరమైన పాఠ్య పుస్తకాల్లో సగం కూడా రాలేదు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు బ్యాగులు 1,23,971 వచ్చాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఇచ్చే బెల్టులు సరిపడా 83,777 చేరాయి. నోట్ పుస్తకాలు 8,16,102కు 6,56,980 మండలాలకు పంపించారు. బూట్లు 1,23,735, వాటికి రెండు జతల చొప్పున సాక్స్‌లు వచ్చాయి. ఒక్కొక్క విద్యార్థికీ మూడు జతల యూనిఫామ్ క్లాత్ ఇవ్వాల్సివుంది. కానీ ఇంతవరకూ మీటర్ యూనిఫామ్ క్లాత్ కూడా రాలేదు. ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులు 14,300 మందికి ఇవ్వాల్సిన ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు కొరతలేకుండా వచ్చాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు 6,715 పిక్టోరియల్ నిఘంటువులు అవసరమున్నాయి. ఇవి 3,012 జిల్లాకు చేరాయి.

సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు

పాఠశాలలు పున:ప్రారంభంలోపు జగనన్న విద్యాకానుక కిట్లు రానున్నాయి. సకాలంలో విద్యార్థులకు అందజేయనున్నాం. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఒకటి రెండు రోజుల్లో రానున్నాయి.

ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రాష్ట్ర జాతా రెండో రోజైన గురువారం విశాఖపట్నం చేరుకున్న సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో రెండు జాతాలు మే 31న ప్రారంభమై జూన్ 8న విజయవాడ చేరుకుంటాయని తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంలో మున్సిపల్ కార్మికులు అగ్రభాగాన ఉన్నారన్నారు. అటువంటి వారిని పర్మినెంట్ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి మరింత బానిసలుగా తయారు చేశారని విమర్శించారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్సులు, ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా రావడం లేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, ఇంజినీరింగ్, మంచినీటి సరఫరా, పార్కుల్లో పనిచేసే కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెటర్నరీ డిపార్టుమెంట్‌లో పనిచేసే కార్మికులకు, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్సు అమలు చేయాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు మెరుగైన పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 తర్వాత రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల జాతాకు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నాయకత్వం వహిస్తున్న నాయకులను అభినందించారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఎల్లవేళలా సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. జాతాలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతి బసు, నాయకులు టి.నూకరాజు, పి.వెంకటరెడ్డి, రమణ, వి.కృష్ణారావు, రత్నం, జె.నాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన మున్సిపల్ జాతా గురువారం కొమ్మాది కూడలికి చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, నాయకులు టి.నూకరాజు, ఎ.జ్యోతిబసు, బి.వరలక్ష్మి, కె.లక్ష్మి, జెఆర్.నాయుడు తదితరులకు కొమ్మాది కూడలి వద్ద మధురవాడ 5, 6, 7, 8 వార్డులకు చెందిన జివిఎంసి అవుట్ సోర్సింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సంఘాల సభ్యులు ఘన స్వాగతం పలికారు. పువ్వులు చల్లి, తేనీరు ఇచ్చి అపూర్వ ఆదరణ చూపారు.

వైసిపి మ్యానిఫెస్టో ఏమైంది ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి మ్యానిఫెస్టో ఏమైందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ప్రశ్నించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు రాజమండ్రి మహానాడుకు ముందు, ఆ తరవాత అనే విధంగా మారాయన్నారు. టిడిపి మొదటి మ్యానిఫెస్టో విడుదల చేసేసరికి 18 మంది మంత్రులు మాట్లాడుతున్నారని తెలిపారు. 98.6 శాతం మ్యానిఫెస్టో అమలు చేశామని చెబుతున్నారని, అటువంటప్పుడు దశలవారీగా మద్య నిషేధం ఎక్కడ అమలైందని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఎక్కడ విడుదల చేసారని, 45 ఏళ్లకు పెన్షన్, ఇంటింటికీ కుళాయి, సిపిఎస్ రద్దు అమలయ్యాయా ? అని ప్రశ్నించారు. గంజాయి, డ్రగ్స్‌లో ఎపిని మొదటి స్థానంలో నిలిచేలా చేశారన్నారు. తమ్మినేని సీతారాం స్పీకర్ అని మర్చిపోయి మాట్లాడుతున్నారని, జగన్‌కు తొత్తుగా మారిపోయారని విమర్శించారు. సమావేశంలో తెలుగు మహిళ విశాఖ జిల్లా నాయకురాలు ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

791వ రోజుకు ఉక్కు జెఏసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 791వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియుఐ మత్స్యకార మహిళలు కె.లక్ష్మి, కె.కనకరాజు, ఎం.లక్ష్మి, జి.కొండ, జి.నూకాలమ్మ, ఎం.ఎర్రమ్మ, జి.దేశమ్మ పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకూ విశాఖ జిల్లాలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 10 వరకూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగ్గురు లైజన్ అధికారుల పర్యవేక్షణలో ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ మూడు బ్లాకుల్లో పరీక్షలు జరుగనున్నట్టు తెలిపారు. ఈ పరీక్షకు 1283 మంది అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. పరీక్ష ప్రారంభానికి రెండు గంటలు ముందుగా మాత్రమే పరీక్షా కేంద్రం తెరవబడుతుందని, అనంతరం పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశ అనుమతి ఉంటుందని అన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించబడవన్నారు. మెటల్ డిటెక్టర్స్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి పరీక్ష హాలులో గోడ గడియారం అమర్చాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు నిరంతరం ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్‌డిసి జెవిఎస్-ఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, డిఎస్ఒ సూర్యప్రకాశరావు, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ఎ.నరసింహారావు, ప్రసూన, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిరణ్‌రాజు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ నాయకుడు మందకృష్ణ మాదిగపై వైసిపి వికలాంగుల హక్కుల విభాగం సభ్యులు బి.కిరణ్ రాజు అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తుల డేవిడ్‌రాజు అన్నారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఎస్.మల్లేశ్వరి, నాయకులు ఎం.రమేష్ బాబు పాల్గొన్నారు.

నేవీ, ఎస్ఎస్‌సి ఉద్యోగాలకు శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ ఛార్జ్‌మెన్, ఎస్ఎస్‌సి గ్రూప్-సి ఉద్యోగాలకు కోచింగ్ ప్రారంభించనున్నట్లు స్టడీ సర్కిల్ నిర్వాహకులు కె.అభిమన్యు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తరగతులు మొదలవుతాయని తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్, జికెలతో పాటుగా 24 ట్రేడ్‌లకు సంబంధించిన అనుభవజ్ఞులైన నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న తరగతులకు ఆసక్తిగల అభ్యర్థులు http://bit.ly/3G1NgEW లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8008412798 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.